ప్రజాశక్తి
శనివారం 31 మే 2025
8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా

పంకజశ్రీకి పగ్గాలు?

● నేడు వైసిపి గన్నవరం నియోజకవర్గ విస్తృత సమావేశం

ప్రజాశక్తి - గన్నవరం : కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు వల్లభనేని వంశీమోహన్ సతీమణి పంకజశ్రీ రాజకీయ రంగ ప్రవేశం చేయనున్నట్లు తెలిసింది. వివిధ కేసుల్లో వంశీమోహన్ వంద రోజులుగా విజయవాడ జిల్లా జైల్లో డిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన ఆరోగ్యం దెబ్బతినడంతో కోర్టు ఆదేశాల మేరకు చికిత్స నిమిత్తం ఆయుష్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈనేపథ్యంలో గన్నవరం నియోజకవర్గంలో పార్టీని నడిపించడానికి నాయకత్వ బాధ్యతలను వంశీ భార్య పంకజశ్రీకి అప్పగించాలని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. ఈక్రమంలో పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు పేర్ని నాని నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేసి పార్టీ నాయకుల అందరి అభిప్రాయాలు తీసుకొని పార్టీ పగ్గాలను ఆమెకు అప్పగించనున్నట్లు తెలిసింది. గత కొంతకాలంగా ప్రభుత్వం వంశీతోపాటు నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులపై కేసులు పెడుతుండడంతో పార్టీని నడిపించడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. తాను వైసిపి నాయకుడినని చెప్పుకోవడానికి సిద్ధపడటం లేదు, కార్యక్రమాలకూ హాజరుకావడంలేదు. దీంతో నియోజకవర్గ పార్టీలో పూర్తిగా నిస్తేజం నెలకొంది. ద్వితీయ శ్రేణిలో సమర్థవంతమైన నాయకుడు లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా పరిస్థితి తయారైంది. మరోవైపు వంశీ 100 రోజులుగా జైల్లో ఉన్నా నియోజకవర్గంలో ఆయనకు అనుకూలంగా ఆందోళన కార్యక్రమాలు చేయడానికి నాయకులెవరూ ముందుకు రాలేదు. ఒకవేళ రోడ్డు మీదకు వస్తే కేసులు పెడతారని భయం (మిగతా 2లో)

నేడు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

2,27,786 మంది పెన్షనర్లకు

రూ.98.11 కోట్లు విడుదల

ప్రజాశక్తి - విజయవాడ : జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఈనెల 31వ తేదీనే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పథకం కింద 2,27,786 పెన్షనర్లకు దాదాపు రూ.98.11 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల వద్ద పెన్షన్ల పంపిణీ సజావుగా సాగేలా కృషిచేయాలని కోరారు. కలెక్టర్ లక్ష్మీశ... శుక్రవారం పెన్షన్ల పంపిణీపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు పంపిణీ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఈటెలీకాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఎ పీడీ ఎఎన్‌వి.నాంచారరావు, విజయవాడ, తిరువూరు, నందిగామ ఆర్‌డిఒలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకష్ణ, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

వార్తలు లోపలి పేజీల్లో

పదవీ విరమణ శుభాకాంక్షలతో

వీరులపాడు మండలం తహశీల్దారుగా పనిచేస్తూ నేడు పదవీ విరమణ చేస్తున్న శ్రీ షేక్ హుస్సేన్ గారికి శుభాకాంక్షలతో...

శ్రీ షేక్ హుస్సేన్
తహశీల్దార్,
జుజ్జూరు మండల కేంద్రం,
వీరులపాడు మండలం

నాగరాజు
డిప్యూటీ తహశీల్దార్
సంధ్య
రెవెన్యూ ఇన్‌స్పెక్టర్,
మరియు కార్యాలయ సిబ్బంది

శ్రీ విశ్వనాధపల్లి శ్రీనివాసరావు, M.E.O -2,
M.A.,(Maths), M.Ed.,
Koduru Mandal.

శ్రీమతి వి.సూర్యకుమారి,
M.A., B.Ed.,

కీ॥శే॥ విశ్వనాధపల్లి జరాసంధుడుగారి దివ్య ఆశీస్సులతో...

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

గత 35 సంవత్సరాల 8 నెలల కాలంలో పవిత్రమైన విద్యారంగంలో SGT గా S.A. (Maths) గా, Grade-2 HM గా వేలకొలది విద్యార్థినీ విద్యార్థులకు మార్గ నిర్దేశకుడిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన పాత్రను నిజాయితీ, నిబద్ధతలతో నిర్వహించి, గత రెండు సంవత్సరాలుగా మండల విద్యాశాఖాధికారి-2 గా మండల విద్యా ప్రగతికి ఇతోధిక సేవలు అందించి, ప్రభుత్వ పాఠశాలల ప్రాకారాల ఆవశ్యకతను గుర్తించి తనదైన శైలిలో రాజీలేని వైఖరితో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ప్రముఖ పాత్ర వహించి, కోడూరు మండలం, M.E.O-2 గా పనిచేస్తూ ఈరోజు (31-5-2025) పదవీ విరమణ చేయుచున్న శ్రీ విశ్వనాధపల్లి శ్రీనివాసరావు గారికి ఇవే మా శుభాభినందనలు...
వారి శేష జీవితం ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విలసిల్లాలని వినమ్రముగా కోరుకుంటూ....

తల్లి : వి.అంకమ్మ

భార్య : ఎన్.లక్ష్మి (late)
M.A.,M.Ed., (S.G.T)

కుమారులు
కులదీప్, M.S., M.B.A., (USA)
మోహన్, M.S., (USA)
హీరేంద్ర

తమ్ముళ్ళ కూతుళ్ళు - అల్లుళ్ళు
ప్రజ్ఞ, B.Tech.,Rly.SI - గోవింద్, B.Tech.,Rly.SI
విజ్ఞ M.Tech., - Dr. రాజీవ్ M.S.,Ph.D.(USA)
తమ్ముళ్ళ కుమార్తెలు, కుమారులు
తేజ M.Tech., (Software), రాజ M.Tech.,(Software)
తనూజ M.Tech.,(Software) , భానూజ M.Tech., (Software)

మేనల్లుడు
Dr. కోలా అవినాష్ M.Tech.,Ph.D.
అక్కా - బావ
ఈశ్వరి (late)
కోలా రాయలు Retd. Chief Engineer

తమ్ముళ్ళు
సాంబశివరావు M.A., B.Ed., SA (Eng.),
భాస్కరరావు DME, B.A.,Maths, Drawing Instructor, AJK ITI
నాగేశ్వరరావు DME, B.A., Dy.Post Master,HSG-1

మరదళ్ళు
ఎన్.ధర్మజ్ఞాని, M.A., B.Ed., S.A. (Eng.)
జ్యోతి, .B.A., HPT
శారదా ముఖర్జీ, B.A., HPT

మరియు బంధుమిత్రులు,
కోడూరు మండల
ఉపాధ్యాయినీ , ఉపాధ్యాయులు

సమావేశంలో మాట్లాడుతున్న విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

నిరంతరం ఓటర్ల నమోదు

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : నిరంతరంగా ఓటర్ నమోదు ప్రక్రియ నిర్వహించాలని సెంట్రల్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం విఎంసి ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో సెంట్రల్ నియోజకవర్గ రాజకీయ పార్టీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధ్యానచంద్ర మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసే ప్రక్రియను నిరంతరం సాగించాలని అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా ప్రతి ఏ ఈ ఆర్ వో తన పరిధిలో గల పోలింగ్ స్టేషన్లలో ఉన్న కాలేజీలలో ఒక ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేసి ప్రతిరోజు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియను చేయాలని అధికారులను ఆదేశించారు. నమోదైన ప్రతి ఒక్కరికీ పివిసి ఓటర్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాన్నారు. విఎంసిలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

యోగా దినోత్సవంలో ఆసక్తిగల వారు పాల్గొనొచ్చు

జూన్ 21న విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆసక్తి ఉన్నవారంతా పాల్గొన వచ్చని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. అందుకు సచివాలయ సిబ్బంది చేసే ఇంటర్నేషనల్ యోగ డే సర్వేలో పాల్గొని సమ్మతి తెలపాలని సూచించారు. నగరంలోని ప్రతి వార్డులో ప్రతిరోజూ ఉదయం 6 నుండి 7 గంటల వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు నరహరిశెట్టి నరసింహారావు, ఎన్ వీరభద్రరావు, ఎం.బాబురావు, తరుణ్ కాకాని, ఎన్ సాంబశివరావు, సుందర్ పాల్, ఎఇఆర్ఒలు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, సెంట్రల్, నార్త్ తహశీల్దార్లు ఎం.వెంకటరామయ్య, ఎం.సూర్యారావు, సెంట్రల్ డిప్యూటీ తహసీల్దార్ టీ.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పంకజశ్రీకి పగ్గాలు?

(మొదటి పేజీ తరువాయి)

వారిని వెన్నాడుతోంది. వంశీకి కొన్ని కేసుల్లో బెయిల్ వచ్చింది. అనారోగ్యం రీత్యా నకిలీ ఇళ్ల పట్టాల కేసులోనూ తాత్కాలిక బెయిల్ మంజూరు చేసి ఆస్పత్రికి తరలించారు. జూన్ 12 తర్వాత టిడిపి కార్యాలయంపై దాడి కేసులోనూ వంశీకి బెయిల్ వస్తుందని అంటున్నారు. ఆ తర్వాత నియోజకవర్గంలోకి వచ్చి పార్టీని చక్కబెడతారనుకుంటున్న తరుణంలో ఆయన ఆరోగ్యం బాగోకపోవడంతో నియోజకవర్గానికి దూరంగా ఉండాల్సి వస్తుందని అంటున్నారు. అయితే పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు గన్నవరం నియోజకవర్గంలో వైసిపిని ఏకతాటిపైకి తీసుకువచ్చి నడిపేందుకు బాధ్యతలను పంకజశ్రీకి అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. నియోజకవర్గ పార్టీలో రెండు వర్గాలున్నాయి. అయినా అందరినీ కలుపుకుపోయే పనిని ఆమె సమర్థవంతంగా నిర్వహిస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

నేడు విస్తృత సమావేశం

వైసిపి గన్నవరం నియోజకవర్గ విస్తతస్థాయి సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గన్నవరంలోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని ఆపార్టీ నాయకులు శీలం రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. మాజీ ఎంఎల్ఎ వంశీ మోహన్ సతీమణి వల్లభనేని పంకజశ్రీ ఆధ్వర్యంలో గన్నవరం ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన నూతన కార్యాలయంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులతోపాటు పార్టీ శ్రేణులంతా సమావేశంలో పాల్గొనాలని రంగారావు విజ్ఞప్తి చేశారు.

సమాజాన్ని మార్చే శక్తి కళాకారులకుంది

● కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : కళాకారులు... సాంస్కృతిక వాస్తు శిల్పులని, సమాజంలో మార్పు తెచ్చే శక్తి వారికి ఉందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. వారి కళా ప్రదర్శనలు సమాజాన్ని మెరుగైన మార్గంలో అడుగులు వేయిస్తాయన్నారు. ఆయుష్‌శాఖ, ఎన్‌టిఆర్ జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ బిఆర్‌టిఎస్ యోగా స్ట్రీట్‌లో నిర్వహించిన ఆర్టిస్ట్ థీమ్ యోగా కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని నాట్యాచార్యులు, కళాకారులతో కలిసి యోగాసనాలు అభ్యసించారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 నాటికి సర్వరోగ నివారిణి అయిన యోగాను రాష్ట్రంలో కనీసం రెండు కోట్ల మందికి, జిల్లాలో దాదాపు 10 లక్షల మందికి చేరువచేసేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ నిపుణుల సహాయంతో రూపొందించిన 45 నిమిషాల సరళ యోగా కామన్ యోగా ప్రోటోకాల్ ద్వారా సమాజంలోని ప్రతిఒక్కరికీ చేరువచేసేందుకు ప్రణాళిక ప్రకారం కషిచేస్తున్నామని చెప్పారు. ఈకార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, విఎంసి అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత

యోగా చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కళాశాల ప్రిన్సిపల్ నరసమ్మ, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, ప్రముఖ నాట్యాచార్యులు కళారత్న భాగవతుల వెంకట రామశర్మ, కళాక్షేత్ర నత్య అకాడమీ హవీష చౌదరి, భక్తనారద గానసభ అధ్యక్షులు కళారత్న డా. ఆకురాతి కోదండరామయ్య, వివిధ కళా సంస్థల ప్రతినిధులు మల్లాది స్వాతి, రఘువేదం కిషోర్, అంబేద్కర్ సాంస్కృతిక సేవా సంఘం ప్రతినిధి జోషి, రుగ్వేదం సిస్టర్స్ గాయకులు పద్మశ్రీ, కష్ణశ్రీ, లిటరరీ కల్చరల్ సర్వీస్ ప్రతినిధి బి.ఆంజనేయరాజు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామత్లేహి, పలువురు కళాకారులు, నాట్యాచార్యులు పాల్గొన్నారు.

తెలుగు వారి కీర్తిని దశదిశలా వ్యాప్తి చేయాలి

● కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ● ముగిసిన కార్యశాల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మాతృ భాషను, తెలుగు వారి కీర్తిని దశదిశలా వ్యాప్తి చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కోరారు. విజయవాడ పుస్తక మహోత్సవ సంస్థ, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక, స్వేచ్ఛ ఆంధ్ర సంయుక్త నిర్వహణలో 11 రోజులపాటు నిర్వహించిన గ్రంథాలయ కార్యశాల శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నిరంతర పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పొందవచ్చని అన్నారు. తెలుగు భాష సంస్కృతికి చారిత్రక నేపథ్యం ఉందని, పూర్వం ఏదైనా ఒక రచన చేస్తే దాన్ని ప్రచురణ కర్తలు ముద్రిస్తే అందరూ చదువుకునే వారని తెలిపారు. కానీ నేడు పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందన్నారు. అర చేతిలో మొబైల్ ద్వారా ప్రపంచాన్ని చూస్తున్నారని, తాను ప్రభుత్వాధికారి హోదాలో ఉన్నానంటే అందుకు కారణం గ్రంథాలయానికి వెళ్లి చదువుకోవడమే కారణమని అన్నారు. తాను కర్నాటకకు చెందిన వాణ్ణయినా తెలుగు భాష, సాహిత్యం కళల్లో కూడా తనకు పట్టు ఉందన్నారు. పిల్లలకు చదువు పట్ల, గ్రంథాలయాల పట్ల ఆసక్తి పెంచడంలో తల్లిదండ్రుల పోత్సాహం అవసరం అన్నారు. ఈ సందర్భంగా

ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తదితరులు

బాలలు చేస్తున్న కార్యక్రమాన్ని వీక్షించారు. నిర్వాహకులను అభినందించారు. ప్రజా గాయకులు చంద్రా నాయక్ దేశభక్తి గేయాలు ఆలపించారు. ప్రచురణ కర్తలు పుస్తకాలతో కలెక్టర్‌ను సత్కరించారు. చక్కని ప్రతిభ కనపర్చిన చిన్నారులకు కలెక్టర్ ధృవీకరణ పత్రాలు అందజేశారు. గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమ ఆవశ్యకత వివరించారు. కార్యక్రమంలో పుస్తక మహోత్సవ సంస్థ అధ్యక్షులు కె.లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్ నాయుడు, జెవివి ప్రతినిధి, కె.శ్రీనివాస్, పల్లవి వెంకట నారాయణ, రెహమాన్, అరసం అరుణ కుమార్, జేపీ ప్రసాద్, నిహారిక, విశ్వరరావు, హసీనా, శోభన్, బోయి రవి తదితరులు పాల్గొన్నారు.

2 నుండి సిపిఎం కృష్ణాజిల్లా రాజకీయ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : సిపిఎం కష్ణాజిల్లా రాజకీయ శిక్షణా తరగతులు జూన్ 1, 2, 3 తేదీల్లో హనుమాన్ జంక్షన్లోని ఏలూరు రోడ్డులో గల ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరుగుతాయని పార్టీ జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తెలిపారు. ఈ తరగతులకు 200 మంది వరకూ హాజరవుతారని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.రాంభూపాల్, రాష్ట్ర నాయకులు ఎస్.వెంకట్రావు వివిధ అంశాలను బోధిస్తారని తెలిపారు. సిపిఎం బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

పాస్‌పోర్ట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన కోసూరి రాంబాబు S/o సాంబయ్య. రాంబాబు అను నాకు భారత ప్రభుత్వం వారు G.2561893 నంబర్ గల పాస్‌పోర్టును మంజూరు చేశారు. ఇటీవల జిరాక్స్ నిమిత్తం కోడూరు నుండి ద్విచక్ర వాహనంపై జి.కొండూరు వెళ్తుండగా మార్గమధ్యంలో ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఎక్కడో జారిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈ నంబర్ **9848135718** ను సంప్రదించగలరు.

కార్మిక హక్కుల కోసం సిఐటియు రాజీలేని పోరాటం

● జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్

● ఆవిర్భావ దినోత్సవంలో పతాకావిష్కరణలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లాలో పలుచోట్ల అరుణ పతాక ఆవిష్కరణలు జరిగాయి. విజయవాడ బెంజిసర్కిల్ కార్మికుల అడ్డా వద్ద సిఐటియు తూర్పు సిటీ అధ్యక్షులు వి.బి.రాజు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు మాజేటి నాగమల్లేశ్వరరావు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సిఐయుటి ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎన్.సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ సిఐటియు అవిర్భవించి 55 ఏళ్లవుతోందని, అప్పటి నుండి కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు చేపడుతూ ముందుకు సాగుతోందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. బడా కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అసంఘటిత రంగ కార్మికులకు

ఆసరాగా ఉన్న సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులను భవన నిర్మాణ కార్మికులకు కల్పించి ఉపాధి చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు సత్యారావు, బి.నరసింహారావు, జి.బుజ్జి, జోగి నాయుడు, బి.నాగరాజు, శోభనాద్రి, డి.వెంకన్న, బి.దుర్గారావు పాల్గొన్నారు. ఆటోనగర్‌లోని సిఐటియు కార్యాలయం వద్ద అరుణ పతాకాన్ని యూనియన్ తూర్పు సిటీ నాయకులు ఎన్.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సిఐటియు తూర్పు సిటీ అధ్యక్షులు వి.బి.రాజు, తూర్పు సిటీ నాయకులు వి.గురుమూర్తి, రవీంద్రబాబు, ఆటోనగర్ కార్మికులు బండి రమేష్, బాజీ, రవి, వీరయ్య, రమేష్, నాని, సత్యనారాయణ, కిరణ్ పాల్గొన్నారు. విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ప్రభాస్ కాలేజీ ఆటో స్టాండ్ వద్ద ఐదు కిలోల కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జండా ఆవిష్కరణ జరిగింది. ఈ ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సెంట్రల్, తూర్పు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శులు ఎం.హనుమంతరావు, బి.రూబెన్ కుమార్, నగర నాయకులు ఎ.వి.రెడ్డి పాల్గొన్నారు.

మహారాజశ్రీ మోటార్ ఆక్సిడెంట్స్ క్లెయిమ్ ట్రిబ్యునల్ కోర్టు, Spl. Sessions judge for fast tracking the cases relating to atrocities against women CUM ఐదవ అదనపు జిల్లా మరియు సేషన్స్ జడ్జి ఖమ్మం.

MATOP No. 462/ 2024

బిట్వీన్
1) శింగలదేవి పిచ్చమ్మ
2) శింగలదేవి బాలకృష్ణ .... క్లెయిమ్ పిటిషనర్స్
మరియు
1. మేకల రవి 2. పెద్దినిట్టి ప్రకాష్
3. ఫ్యూచర్ జనరలీ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ లిమిటెడ్ .... రెస్పాండెంట్స్

To
రెస్పాండెంట్ నెం 2:-
పెద్దినిట్టి ప్రకాష్, తండ్రి:సత్యనారాయణ , వయస్సు, మేజర్, వృత్తి: ఓనర్ అఫ్ ఆశోకా లిలైలాండ్ దోస్తి ఆర్ యల్ యక్స్ బేరింగ్ నెంబర్ AP. 07TH 6211, నివాసం, ఇంటి నెం 3-38-4, దొనపాడు రోడ్డు, గుడివాడ కృష్ణ జిల్లా,ఆంధ్రప్రదేశ్.

నోటీసు

పైన తెలిపిన క్లెయిమ్ పిటీషనర్ మీపై మోటార్ ఆక్సిడెంట్ క్లెయిమ్ రాబట్టుకొనుటకై పైన తెలిపిన కోర్టు (మహారాజశ్రీ మోటార్ ఆక్సిడెంట్స్ క్లెయిమ్ ట్రిబ్యునల్, ఐదవ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్ట్ : ఖమ్మం నందు MATOP.నెం 462 ఆఫ్ 2024 దాఖలు చేసియున్నారు. అట్టి దావా లో మీ హాజరు కొరకు ది.06/06/2025న వాయిదా ఉండి వున్నది. కావున ఆ రోజు మీరు స్వయముగా కాని లేక మీ తరుపు న్యాయవాది ద్వారా కాని జవాబు చెప్పుకోనుటకు పైన తెలిపిన కోర్టు యందు ఉదయం 10:30 ని.లకు హాజరు కాగలరు. లేని ఎడల మీ పరోక్షములో తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతితో//

బిల్లా శ్రీనివాసరావు,
ఖమ్మం బిల్లా క్రాంతికుమారి,
తేది.30-05-2025. న్యాయవాదులు, ఖమ్మం
సెల్:9951232022.

గృహాల నిర్మాణంలో పురోగతి లేకుంటే సస్పెన్షన్ : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో గృహ నిర్మాణంలో పురోగతి లేకుంటే ఉపేక్షించేది లేదని, బాధ్యులైన వారిని సస్పెండ్ చేస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం హాలులో గృహ నిర్మాణ పురోగతిపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణం చాలా వెనుకబడి ఉందన్నారు. గత 15 రోజులు కిందట నుండి గహ నిర్మాణంలో చాలా మండలాల్లో అనుకున్న స్థాయిలో పురోగతి లేదన్నారు. ఈనెల 13వ తేదీన సమీక్షించినపుడు 910 గహాలను పూర్తి చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కేవలం 412 గృహాలు మాత్రమే పూర్తి చేశారన్నారు. మచిలీపట్నం పట్టణం, అవనిగడ్డ కోడూరు గన్నవరం, చల్లపల్లి, పెదపారుపూడి, కృత్తివెన్ను, మోపిదేవి, గుడివాడ, నాగాయలంక మండలాలు పురోగతిలో చాలా వెనుకబడ్డాయన్నారు. మరలా వచ్చే సమావేశం జూన్ నెల 13వ తేదీన నిర్వహిస్తామని ఆ తేదీ నాటికి పనితీరు మార్చుకోక నిర్లక్ష్యంగా ఉంటూ సరైన పురోగతి చూపకపోతే కింది స్థాయి నుండి పై స్థాయి వరకు బాధ్యులైన వారిని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ తో సహా అందరిని సస్పెండ్ చేస్తామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. గహ నిర్మాణం పై మండల ప్రత్యేక అధికారులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించి సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లతో పాటు వసతుల కార్యదర్శులు, గహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో తరచూ సమావేశాలు నిర్వహించి నిర్ణీత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గహ నిర్మాణ సంస్థ అధికారి వెంకటరావు, టిడ్కో ప్రాజెక్టు డైరెక్టర్ చిన్నోడు, మచిలీపట్నం, పెడన, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, గోపాలరావు ,వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారులు జెడ్పి డిప్యూటీ సీఈవో ఆనంద కుమారు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

మారణాయుధాలతో మందుబాబులు హల్‌చల్

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణంలోని ఏలూరు రోడ్డు ఆర్కే కాంప్లెక్స్ వద్ద శుక్రవారం మందుబాబులు మద్యం మత్తులో కత్తులతో వీరంగం సృష్టించారు. వివరాల్లోకి వెళితే ఏలూరు రోడ్డులోని ఆర్‌కె కాంప్లెక్స్ వద్ద సంట్రల్ వైన్‌షాప్ మెయిన్ రోడ్డులో ఉండడం వలన మద్యం సేవించిన యువకులు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి కత్తులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ప్రజలు ఒక్కసారిగా ఆందోళన చెందారు. దాదాపు 20 నిమిషాలకు పైగా ఈ దాడి కొనసాగింది. పోలీసులు గాని ప్రజలు గాని వారిని ఆపే ప్రయత్నం కూడా చేయలేదు. మెయిన్ రోడ్‌లో వైన్ షాపు ఉండటం వలన ప్రక్కన వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుపుతున్నారు. పర్మిట్ రూమ్ కూడా ఇవ్వడం వలన మందుబాబులు అక్కడే మద్యం సేవించి ప్రజల పైన వ్యాపారుల పైన కూడా దాడులకు దిగుతుండటంతో ప్రజలు షాపులకు రాలేక పోతున్నారని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందు బాబులు వలన వ్యాపారాలు చేయలేని పరిస్థితి ఏర్పడిరదని వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా మద్యం సేవించిన యువ కుడు పోలీసులను కూడా బెదిరించే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు కూడా మందుబాబులను ఏమీ చేయలేక అలాగే ఉండిపోయారు.

దాడి చేసుకుంటున్న మందుబాబులు

4న 'వెన్నుపోటు దినం' : కైలే

ప్రజాశక్తి - పామర్రు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైయస్ జగన్ పిలుపుమేరకు జూన్ 4న నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం తన కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు.ప్రజల్ని మోసం చేసిన కూటమి ప్రభుత్వ విదానాలను ఎండకట్టడానికి పామర్రు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగేఈ నిరసన కార్యక్రమంలో వైసిపి శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఎన్నికల ముందు ప్రజలకు మాయమాటలు చెప్పి గెలిచాక పధాకాలు ఇవ్వకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వ దగాకోరు తనాన్ని ఈ సందర్భంగా ప్రజలకు వివరిస్తామన్నారు.

మృతిచెందిన ఉపాధి కార్మికురాలికి ప్రమాద బీమా చెల్లించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఉపాది పనికి వెళ్లి అస్వస్థకు గురై మృతి చెందిన మోదుమూడి గ్రామానికి చెందిన గాజుల లక్ష్మికి ప్రమాద బీమా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ పనికి వెళ్లి లక్ష్మి చిన్న వయసులో చనిపోవడం బాధాకరమని, ఇప్పటికైనా పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. మెడికల్ కిట్లు, షామియానా, మంచినీరు ప్రతిరోజు అందుబాటులో ఉంచాలని కోరారు. గాజుల లక్ష్మి మతికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా తరఫున సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : వేసవి కాలం ఎండలు పురస్కరించుకుని ప్రతిరోజు పాదచారులకు, ప్రయాణీకులకు, పుర ప్రజలకు మజ్జిగతో పాటు శీతల పానీయాలు, మంచినీటి పంపిణీ కొనసాగిస్తున్నామని మచిలీపట్నం ఆర్యవైశ్య సంఘ నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక గీతా మందిరంలో మజ్జిగ పంపిణీ చేశారు. మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు పాల్గొని ఆర్యవైశ్య సంఘం నాయకులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు .

ఉగ్రవాదం, మతోన్మాదం ప్రమాదకరం

మాట్లాడుతున్న శీలం నారాయణరావు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉగ్రవాదం మతోన్మాదం దేశానికి అత్యంత ప్రమాదకరమని, స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం సార్వభౌమాధికారం లౌకికవాదం దేశానికి ప్రతీకలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శీలం నారాయణరావు అన్నారు. శుక్రవారం ఉగ్రవాదం మతోన్మాదం అనే అంశంపై ఉయ్యూరు శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. పహల్గాం ఉగ్ర దాడి అనంతరం ఆర్‌ఎస్ఎస్, బిజెపి దాని అనుబంధ పార్టీలు మతోన్మాద చర్యలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు మన అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో మతసామరస్యం వెల్లి విరిసే లాగా దేశ సమగ్రతను సమైక్యతను కాపాడుకునేందుకు దేశ భద్రతపై చర్యలు ఉండాలని ఆయన అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె శివ నాగేంద్రం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి రాజేష్ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలుబి కీర్తి యూటీఎఫ్ జిల్లా నాయకులు పివి రమణ హబీబ్ పార్టీ సభ్యులు పడాల లక్ష్మణరావు నెమ్మది నాగమణి నెమ్మాది ప్రశాంతి అన్నే సుబ్బారావు బసవరాజు పాల్గొన్నారు.

రేపటి నుండి రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : జూన్ 1 నుండి రేషన్ కార్డుల వారికి చౌకధరల దుకాణాల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తహసీల్దార్ ఎం.సురేష్ కుమార్ తెలిపారు. చౌకధరల దుఖాణంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేసే సమయాలు, డీలర్ పేరు, ఫిర్యాదులు చేసే ఫోన్ నంబర్లు ఇతర వివరాల బోర్డును కడవకొల్లు వీరవల్లిమొఖాసా దుఖాణంలో శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా ఈ పోస్ యంత్రం పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేర పారదర్శకంగా సరుకులు పంపిణీ చేయాలని డీలర్ కు సూచించారు. అనంతరం స్థానికుల నుద్దేశించి మాట్లాడుతూ చౌకధరల దుఖాణాలు ప్రతినెలా 1 నుండి 15వ తేదీవరకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటలవరకు తెరచి ఉంటాయన్నారు. కార్డుదారులు వారికి అనుకూల సమయంలో రేషన్ తీసుకోవచ్చని, వద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే నిత్యావసర సరుకులు డీలర్ ద్వారా అందించబడతాయని పేర్కొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారానే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని తహసీల్దార్ నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రేషన్‌డీలర్లు, విఆర్ఒలతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రేషన్ దుకాణాల ద్వారానే అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల విఆర్ఒలు, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

ఉయ్యూరు మండలంలో స్టాకు పరిశీలిస్తున్న తహసీల్దార్

పమిడిముక్కల మండలంలో మాట్లాడుతున్న తహసీల్దార్

పోగొట్టుకున్న పర్సు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపో బస్సులో అవనిగడ్డకు చెందిన ఉడత వెంకటరమణమ్మ బస్సులో నగలు నగదు తో కూడిన పర్సు మర్చిపోవడంతో తిరిగి ఆమెకు ఆర్టీసీ అధికారులు పర్సు అందజేశారు. శుక్రవారం విజయవాడ నుండి వచ్చిన వెంకటరమణమ్మ అవనిగడ్డ బస్టాండ్‌లో దిగి ఇంటికి వెళ్ళిపోగా తన వద్ద ఉండవలసిన పర్సు కవరు మర్చిపోయినట్లుగా గుర్తించి ఆమె మనవడితో కలిసి డిపోలో ఎంక్వయిరీ చేయించారు. పర్సులో రెండు సవర్ల బంగారపు నాన్తాడు, 890 రూపాయలు నగదు ఉన్నట్లు మహిళ తెలపడంతో బస్సు సిబ్బందితో మాట్లాడి టికెట్ సరిచూసుకొని పర్సును ఆమెకు డిపో మేనేజర్ కే హనుమంతరావు అందజేశారు. ఈ సందర్భంగా ప్రయాణికురాలు రవణమ్మ ఆనందం వ్యక్తం చేసి ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీలక్ష్మి, ఆర్టీసీ డిపో సెక్యూరిటీ హెడ్ రాఘవయ్య, డిసి బి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉరివేసుకొని ఒక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-విజయవాడ : గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని మృతిచెందిన సంఘటన శుక్రవారం కృష్ణలంక పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్టేషన్ సిఐ నాగరాజు మాట్లా డుత శుక్రవారం తెల్లవారు జామున 5.30 గంటల సమ యంలో కృష్ణలంక పద్మావతి ఘాట్ దగ్గర ఇరిగేషన్ ఆఫీసు ప్రధాన గేటు వద్ద తాడుతో ఉరి వేసుకొని మృతి చెందాడన్నారు. అతనికి 50 సంవత్స రాలు ఉంటాయని, గ్రీన్‌రంగు షర్ట్, నల్లని కలర్ ప్యాంట్ ధరించి ఘాట్ వద్ద పైప్‌కు తాడుతో ఉరి వేసుకొని చనిపోయాడన్నారు.. ఇరిగేషన్ ఆఫీసు మెయిన్ గేట్ వద్ద లైట్‌లు ఆపడానికి అని వెళ్లిన లస్కర్‌గా పని చేసే జెట్టి రఘురామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

వరికి మద్దతు ధర పెంచాలని నిరసన

ప్రజాశక్తి-బంటుమిల్లి : కేంద్ర ప్రభుత్వం పంటలకు ప్రకటించిన మద్దతు ధరల్లో వరిక కేవలం క్వింటాకు 69 రూపాయలు పెంచడం తగదని రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు అన్నారు. వరికి మరింత మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ శుక్రవారం బంటుమిల్లిలోని లక్ష్మీపురం సెంటర్లో జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వరికి మద్దతు ధర క్వింటాలకు 69 రూపాయలు పెంచడం అతిదారుణమని అన్నారు. వరి రైతులను నిర్వీర్యం చేయడం తగదన్నారు. వరికి కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.3200 వరకు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా క్వింటాకు కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఇస్తున్నట్టు 500 రూపాయలు బోనస్ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. అలాగే ఆక్వా రైతుల ఉత్పత్తులకు కూడా కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పీ ధర ప్రకటించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మాజేటి శ్రీనివాసరావు,కత్తివెన్ను మండల రైతు సంఘం అధ్యక్షులు పట్టపు ఏసుబాబు, రైతు సంఘం నాయకులు రాయపురెడ్డి జేజిబాబు, పాశం సూరిబాబు, గౌరీశెట్టి శ్యాంబాబు, బాపూజీ బంటుమిల్లి మండలం రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్ పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పాడి రైతుల కోసం పరిశ్రమల స్థాపన

కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

ప్రజాశక్తి-వన్‌టౌన్

పాడి రైతులకు అవసరమైన పరిశ్రమలను నెలకొల్పేందుకు కృషి చేయాలని తమ పాలకవర్గ సమావేశంలో నిర్ణయించడం జరిగిందని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చెప్పారు. శుక్రవారం విజయవాడ పాల ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలుగా పాడి రైతుల, వినియోగదారుల సంక్షేమం రెండు కళ్ళుగా యూనియన్ పనిచేస్తుందని చెప్పారు. జాతీయ స్థాయిలో గుజరాత్‌లోని ఆనంద్‌లో జరిగిన సహకార భారతి సమావేశంలో విజయ డెయిరీ సక్సెస్ స్టోరీని ప్రజెంట్ చేయడం జరిగిందన్నారు. అలాగే సహకార భారతి డెయిరీ సెల్ కు సంబంధించి జాతీయ స్థాయిలో పదిమందితో ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీలో తనను సభ్యునిగా నియమించినట్లు చెప్పారు. ఇప్పటికే పాలు, పాల ఉప ఉత్పత్తులను ప్రజలకు అందజేస్తున్నామని వివరించారు. తాజాగా ఆవు నెయ్యి, గేదె నెయ్యి కిలో, అరకిలో, 200 గ్రాముల పరిమాణంలో

మార్కెట్లోకి విడుదల చేశామని చెప్పారు. సహకార భారతి సంస్థ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు అడ్డూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ 1979లో సహకార భారతి స్థాపించిన తర్వాత సహకారంలోని వివిధ విభాగాల బలోపేతానికి సహకార భారతి కృషి చేస్తూ వచ్చిందని చెప్పారు. ఈ సమావేశంలో కృష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసికి శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-భవానీపురం: ఎల్ఐసికి కెకెఎస్ శ్రీనివాస్ అందించిన సేవలు ప్రశంసనీయమని భవానిపురం ఎల్ఐసి బ్రాంచ్ సీనియర్

మేనేజర్ కె. జయరాజు కొనియాడారు. శుక్రవారం ఎల్ఐసిలో గత 36 సంవత్సరాలుగా డెవలప్మెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన కేకేఎస్ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ ఎల్ఐసి అభివృద్ధిలో, డివోగా శ్రీనివాస్ చక్కటి కృషి చేశారని అభినందించారు. కస్టమర్లకు ఎల్ఐసిని చేరువ చేయడంలో ఆయన ముందున్నారని అన్నారు. ఈ సందర్భంగా డివో శ్రీనివాస్‌ను ఆయన నేతృత్వంలోని ఎల్ఐసి ఏజెంట్లు బంగారపు ఉంగరం తొడిగి, పూలదండలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భవానిపురం బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్. కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి-తిరువూరు: ఎ.కొండూరు మండలంలోని పాత కొండూరు, కుమ్మరికుంట గ్రామాల్లో 50 సంవత్సరాల క్రితం పట్టాలు పొందిన

దగ్గర నుండి సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు మంజూరు చేసి భూమి హక్కు కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో దళిత, గిరిజన రైతులు శుక్ర వారం తిరువూరు రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. విచారణ జరిపించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈసందర్భంగా సిపిఎం ఏ.కొండూరు మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడుతూ 50 సంవత్సరాల నుండి దళిత, గిరిజన పేద రైతులు భూముల ను సాగు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. భూములు ఆన్ లైన్ చేయాలని అధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నా స్పందించడంలేదని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆ భూములకు పట్టాలు ఇచ్చి ఆన్ లైన్ చేసి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బలగాని వెంకటేశ్వరావు, జెట్టి వెంకటేశ్వరావు, రైతులు సి.హెచ్. వెంకటేశ్వరావు, వెంకన్న, బె జవాడ వెంకటేశ్వ రావు, భూక్యా బిచ్చా, ప్రశాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి జగ్గయ్యపేట: తెనాలి బార్ అసోసియేషన్ న్యాయవాది జాన్ విక్టర్‌పై పోలీసుల చట్ట వ్యతిరేక చర్యలను ఖండిస్తూ శుక్రవారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అన్నెపాగ సుందరరావు

ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా న్యాయవాదులు మాట్లాడుతూ 'న్యాయవాదుల రక్షణ చట్టం' అమలును విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్యామల నరసింహారెడ్డి, ఎం ఆంజనేయులు, రావూరి ప్రసాద్, కె ప్రతాప రెడ్డి, అశోక్, నరేష్, చిన్న గాంధీ, అంకమ్మ రాజు, భిక్షమయ్య, రాజశేఖర్, రవి, ఉమామహేశ్వరరావు, మన్నెం మురళి, గురువుల రాజు తదితరులు పాల్గొన్నారు. **నందిగామ:** తెనాలి పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నందిగామ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వరదబోయిన విజయకుమార్ ఆధ్వర్యంలో నందిగామ న్యాయవాదులు కోర్టు విధులను శుక్రవారం బహిష్కరించారు. న్యాయవాదులు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునే విధంగా వ్యవహరించిన తెనాలి పోలీసులపై కఠిన

చర్యలు తీసుకోవాలని, చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అడ్వకేట్ జాన్ విక్టర్, కరీముల్లా, రాకేష్ లను కొట్టిన పోలీసులు పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఉప్పులూరి డేవిడ్ రాజ్, మాజీ బార్ అధ్యక్షులు చిరుమామిళ్ల శ్రీనివాసరావు, దర్శి అర్జున్, దాదా హుస్సేన్, పాల్ ప్రసాద్ బాబు, వేల్పుల స్వామి, అప్పాజీ, ఫణి కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కబేళా రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-విజయవాడ: వన్‌టౌన్ కబేళా ప్రాంతంలోని నగరపాలక సంస్థ రోడ్డును నిర్మించడానికి అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు స్థానికులతో కలిసి నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్రకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కబేళా రోడ్డును ఆక్రమించాలనే దురుద్దేశంతో రోడ్డు నిర్మాణపు పనులను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకొని, తక్షణమే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. ఆక్రమణల దారుల నుంచి స్థానిక ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కొంతమంది రాజకీయ నాయకుల ముసుగులో నగరపాలక సంస్థకు చెందిన ఆయా ప్రాంతాల్లోని విలువైన స్థలాలను కబ్జాలు చేసి ఆక్రమించడం పరిపాటిగా మారిందని అన్నారు. నగరపాలక సంస్థ అధికారులు వెంటనే స్పందించకపోవడం వలన నగరపాలక సంస్థ కు చెందిన విలువైన స్థలాలు కబ్జాలకు గురి అవుతున్నాయని అన్నారు. కమిషనర్ స్పందించి కబేళా రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కబేల ఏరియా అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బివి రమణ, కార్యదర్శి డి శివప్రసాద్, ఎం పుష్పలత, ఎండి అన్వర్ భాష, సిహెచ్ విజయ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై ఇఒ వి.కె.శీనానాయక్ శుక్రవారం వివిధ విభాగాలను పరిశీలించారు. దేవస్థానంలో కొండ కింద, పైన జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులతో పనుల స్థితి గురించి చర్చించి, పనులు నాణ్యతతో ఉండేలా చూస్తూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో పోలేరమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక ఊర్మిళ సుబ్బారావు నగర్ గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్లు వచ్చే నెల 27, 28, 29 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు పోలేరమ్మ దేవస్థానం కమిటీ అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి చెప్పారు. శుక్రవారం పోలేరమ్మ దేవస్థానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామిరెడ్డి మాట్లాడుతూ ఊర్మిళ నగర్ లో పోలేరమ్మ అమ్మవారు వెలసి 39 సంవత్సరాలైనట్లు చెప్పారు. ప్రతి ఏటా తమ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పోలేరమ్మ తిరునాళ్లు నిర్వహిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థానం కమిటీ కార్యదర్శి గుత్తావలి విజయబాబు, ట్రెజరర్ దొడ్డా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు మాగం ఆత్మారాం తదితరులు పాల్గొన్నారు.

200 రోజులు పని దినాలు కల్పించాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గంద్రాయి, షేర్ మహమ్మద్ పేట, బలుసుపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ ఒక పక్క వ్యవసాయపు పనులు క్రమేపీ తగ్గిపోతున్నాయన్నారు. రెక్కల కష్టమే ఆధారంగా జీవిస్తున్న ఉపాధి హామీ కార్మికులకు వంద రోజుల పనులే

ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న కళ్యాణ్

దిక్కవుతున్నాయన్నారు. పొమ్మనలేక పొగబెట్టే తీరుగా ప్రభుత్వాలు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. పనిచేసిన రెండు వారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా, 13 వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కార్మికులు పాల్గొనాలని కోరారు.

'ఆల్ సెయింట్స్'లో గ్రామీణ విద్యార్థులకు ఉత్తమ విద్య

కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ వై.జయప్రసాద్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: 1994లో చిల్లకల్లు పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం విజయవాడ రోమన్ క్యాథలిక్ మిషన్ డయాసిస్ ఆధ్వర్యంలో ఆహ్లాద వాతావరణంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ విద్యను అందించడమే లక్ష్యంగా సేవా దక్పథంతో ఆల్ సెయింట్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రారంభించినట్లు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ వై.జయప్రసాద్ తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో తమ పాఠశాల మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియం పాఠశాల అని తెలిపారు. అనుభవజ్ఞులు, అంకితభావం ఉన్న ఉపాధ్యాయులతో విద్యా బోధన అందించడం తమ ప్రత్యేకతన్నారు. విద్యార్థులు కష్టంగా భావించే ఇంగ్లీష్ భాషను సులభమైన రీతిలో బోధించడం, విద్యార్థులకు భాష పట్ల ప్రేమాభిమానాలు కలిగించి ఉత్తమ రీతిలో విద్యను అందించడం, విద్యార్థులందరూ ఇంగ్లీషులో మాట్లాడేటట్లు కృషి చేయడమే తమ పాఠశాల పరమావధి అన్నారు. విద్యతో పాటు సాంకేతిక, కళాత్మక రంగాల్లో శిక్షణ, వ్యవహార సంప్రదాయాలపై అవగాహన, విద్యార్థుల కోసం ఉచిత మెడికల్ చెకప్ సౌకర్యం, ఒకటో తరగతి నుండి కంప్యూటర్ శిక్షణ, మానసిక, శారీరక అభివృద్ధికి క్రీడలు, నాట్యం, వివిధ వినోద, వ్యూహాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు విజ్ఞాన తరగతులు, విహారయాత్రలు, ప్రస్తుత అంశాలపై పట్టు పెంపొందించుటకు క్విజ్ కాంపిటేషన్, గ్రూప్ డిస్కషన్, డిబేట్, భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుటకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

పాఠశాల ప్రత్యేకతలు

- కేరళలో శిక్షణ పొందిన సిస్టర్స్‌తో విద్యా బోధన
- కంప్యూటర్ ల్యాబ్
- కరాటేలో ప్రత్యేక శిక్షణ
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన
- స్టడీ అవర్స్ నిర్వహణ
- విశాలమైన క్రీడా ప్రాంగణం
- బస్సు సౌకర్యం
- సాంస్కృతిక కళల్లో ప్రత్యేక శిక్షణ
- మినరల్ వాటర్ ప్లాంట్
- విజ్ఞాన యాత్రలు
- విశాలమైన తరగతి గదులు
- హాస్టల్ సౌకర్యం

పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు

ఈ ఏడాది పదో తరగతి ఫలితల్లో ఆల్ సెయింట్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. స్కూల్ ఫస్ట్ జాల జయశ్రీ 585 మార్కులు, సెకండ్ గంపాల ఉదయ్ కిరణ్, 580, థర్డ్ వేల్పుల శరణ్య 579, నాల్గో స్థానం ఎ.తేజ్ నాథ్ 542 మార్కులు సాధించారు. 12 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. మొత్తం 28 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణత సాధించారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, మరిన్ని వివరాలకు 63022 79782, 94936 53266 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ జయప్రసాద్ తెలిపారు.

2న గుడివాడలో ఐదువేల మందితో 'యోగాంధ్ర'

- కలెక్టర్ డికె బాలాజీ

కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : జూన్ 2న గుడివాడలో 5వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి గుడివాడలో యోగా కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 2వ తేదీన గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో 5 వేల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. లారీ, ఆటో డ్రైవర్ల అసోసియేషన్, బ్యాంకర్లు, సహకార సంస్థలు, యోగా ఔత్సాహికులు అనే ఇతివత్తంతో ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుండి ఉదయం 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుడివాడ ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ ఇరువురు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కే చంద్రశేఖరరావు, యోగాంధ్ర సమన్వయ అధికారి పోతురాజు, గుడివాడ ఆర్డిఓ జీ బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ రావు, డి ఎస్ డి ఓ ఝాన్సీ లక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, పర్యాటక శాఖ జిల్లా అధికారి రామ లక్ష్మణరావు, ఏపీఎస్ఆర్టీసీ మచిలీపట్నం డిఎం పెద్దిరాజు, డ్వామా పీడీ ఎన్వీ శివ ప్రసాద్ యాదవ్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి షాహిద్ బాబు పాల్గొన్నారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నగర కార్పొరేషన్ ఈడేపల్లి లో శుక్రవారం గానుగ కొట్టు సెంటర్ నుండి సిడింబి అగ్రహారం మున్సిపల్ పార్కు వరకు యోగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కృష్ణాజిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి కే ఝాన్సీ లక్ష్మి పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంజాల రవికుమార్, కొనకళ్ళ భాను ప్రసాద్, డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు, మురాల నాగేంద్రరావు, మడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బందరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు : దైనందిన జీవితంలో యోగాకు కొంత సమయం కేటాయించి యోగాభ్యాసన చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని యోగా గురువు, సాత్విక్ యోగా శిక్షకుడు జి. కష్ణ అన్నారు. జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక పాత షాదీ ఖానాలో కుట్టు నేర్చుకుంటున్న మహిళలకు యోగాభ్యాసన నేర్పించారు.

విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్, ప్రిన్సిపల్ కొరివి అనిల్ కుమార్

ఒలింపియాడ్‌లో 'రవితేజ' స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు లోని రవితేజ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు గత డిసెంబర్ నెలలో గోదావరి ఒలంపియాడ్ గోదావరి ప్రెస్ క్లబ్ రాజమండ్రి వారు సంయుక్తంగా నిర్వహించిన గోదావరి టాలెంట్ టెస్ట్ లో పలు సబ్జెక్టులలో మంచి ఫలితాలు రాష్ట్రస్థాయిలోనూ జిల్లా స్థాయిలోనూ సాధించారని పాఠశాల డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ జూనియర్స్ సీనియర్స్ విభాగం నుంచి కష్ణాజిల్లాలో మొదటి స్థానం మా స్కూల్ విద్యార్థులు సాధించారన్నారు. అలాగే తెలుగు సబ్జెక్టులో రాష్ట్రస్థాయిలో యార్లగడ్డ నాగలక్ష్మి కి మొదటి స్థానం లభించింది అన్నారు. ఇంతటి విజయానికి కారకులైన ఉపాధ్యాయ సిబ్బందిని డైరెక్టర్ వల్లభనేని వరప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కొరివి అనిల్ కుమార్ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ తమ్ము శకుంతల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని విజేతలైన విద్యార్థులను అభినందించారు.

వానలు.. భయపెడుతున్న దోమలు

ప్రజాశక్తి-గన్నవరం : కొద్దిరోజులుగా కురిసిన వర్షాలకు గ్రామాల్లో దోమల బెడద ఎక్కువై విష జ్వరాలు, మలేరియా వంటి వ్యాధులను వ్యాపింప చేస్తున్నాయని జనాలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా జనాలపై దాడులు చేసి రక్తం పిలిచేస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్ వ్యాధులను విస్తరింప చేస్తున్నాయి. దోమ కాటుతో జ్వరాల బారిన పడి పిల్లలు, పెద్దలు, వద్ధులు అల్లాడుతున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు ఆసుపత్రిలోని వైద్యులు రోగులను పిండేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందే వారి సంఖ్య పెరుగుతుంది. రాత్రి అయితే చాలు ఇళ్లలోకి ప్రవేశించిన దోమలతో కంటిమీద కునుకు లేకుండా పోతుందని పేదలు అంటున్నారు. ప్రజల అవస్థలు వర్ణాతీతంగా ఉన్నాయని చెప్పాలి. మురుగు నీరు నిలవకుండా చేయడం ఎవరి వల్ల కావడం లేదు. జనాలు చెత్త పారవేయడంతో కాలవల్లో నీరు ఎక్కడిది అక్కడే ఉండిపోతుంది. కొంతమంది బాధ్యతా రాహితంగా చేసే పనుల వల్ల దోమలు పుట్టి పెరిగి చివరకు జనాల మీదే దాడులు చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు దోమల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి జరిగి నెల రోజుల కావస్తున్న వారి జాడ కూడా కేంద్రం కనుక్కోలేకపోయిందని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వై కేశవరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం మహాత్మా జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రం వద్ద సమైక్యత సదస్సు నిర్వహించారు. కెవిపిఎస్ నాయకులు చీకటి రాజేష్ ఈ సదస్సు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వై కేశవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యంగా అభివర్ణించారు. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా దానిని అంతమొందించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, సీనియర్ నాయకులు కొడాలి శర్మ, ఎస్ ధనుంజయరావు, సిపిఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సిఐటియు మండల కార్యదర్శి చిరువోలు జయరావు, ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి చంద్రపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వై. కేశవరావు

పెరట్లో కూరగాయల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు : ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన భోజన అలవాట్లను పెంపొందించుకోవాలని ఉంగుటూరు మండలం ఆత్కూరు టీం మిషన్స్ ఇన్ ఇండియా డైరెక్టర్ పులపాక సుధాకర్ అన్నారు. శుక్రవారం ఆత్కూరు టీం మిషన్స్ ఇన్ ఇండియా ప్రాంగణంలో మహిళలకు హెల్త్ ఎడ్యుకేషన్, సేంద్రీయ పద్ధతుల్లో పెరట్లో కూరగాయల పెంపకం, గ్యాస్ వినియోగ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ తమ ఇంటి పెరట్లో సేంద్రీయ పద్ధతుల్లో కూరగాయలు పెంచి వినియోగించుకుంటే ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయి అన్నారు. మానవుని ఆహారపు అలవాట్లు జీవనశైలి మార్చుకోవాలని సూచించారు. గన్నవరం హెచ్ పి గ్యాస్ డీలర్ ప్రసాద్ మాట్లాడుతూ గ్యాస్ స్టవ్ వినియోగ సమయంలో జరిగే ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై గహిణులకు అవగాహన కల్పించారు. విశ్వ ప్రజ్ఞ స్వచ్ఛంద సంస్థ, విలేజ్ హెల్త్ వర్కర్ తదితరులు పాల్గొని సేంద్రీయ పద్ధతుల్లో కూరగాయలు పండించి వినియోగించుకోవడం వల్ల ప్రజారోగ్యం మెరుగుపడుతుందని, ప్రజారోగ్య పరిరక్షణకు పాటించాల్సిన తగు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి సమర్పణ

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి శుక్రవారం భక్తులు ముడి వెండి సమర్పించుకున్నారు. తెనాలికి చెందిన కడియాల సుధీర్ కుటుంబ సభ్యులు స్వామివారికి భక్తితో 3కేజీల 600 గ్రాములు బరువు కలిగిన ముడి వెండి (సుమారుగా 3 లక్ష 50 వేల రూపాయలు) స్వామివారికి కానుకగా అందజేశారు. డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉప పర్యవేక్షణ అధికారి అచ్యుత మాధవరావు పాల్గొన్నారు.

ఫైబర్ గేట్లతో ఫలితం శూన్యం

- పొలాలను ముంచెత్తుతున్న ఉప్పునీరు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామ సమీపాన కృష్ణానది కరకట్టపై ఉన్న కోడూరు అవుట్ పాల్స్ స్లూయిస్ కు ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా ఫైబర్ గేట్లు బిగించారని కానీ ఫలితం శూన్యమని స్థానిక రైతులు వాపోతున్నారు. రైతుల అభ్యర్థన మేరకు అవుట్ పాల్స్ కు ఫైబర్ గేట్లు బిగించడం సంతోషకరమని, కానీ ఆ గేట్లు బిగించిన తర్వాత కూడా యధావిధిగానే ఉప్పు నీరు ఎగువకు ప్రవహించి పంట పొలాలను ముంచేస్తున్నాయి. అవుట్ పాల్స్ బేస్మెంటును సరి చేయకుండా (గేట్ల వద్ద ఉన్న గొయ్యలను పూడ్చ కుండా) గేట్లు బిగించడంతో గేట్ల కింద నుంచి ఉప్పునీరు ప్రవహిస్తుందన్నారు. వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి అవుపాల్స్ గేట్ల కింద ఫ్లోరింగ్ కు మరమ్మతులు చేసి ఉప్పు నీరు ఎగువకు రాకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గేట్ల కింద నుంచి నీరు పోతున్న దృశ్యం

డ్రైనేజీల్లో పూడికతీత

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరంలో డ్రైనేజీల పూడికతీత పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వర్షాకాలం ప్రారంభం కావటంతో గ్రామాల్లోని డ్రైనేజీల పూడిక తీసి శుభ్రం చేయాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులు ఆదేశించారు. ఈ మేరకు గ్రామపంచాయతీ నిధులతో గన్నవరంలో డ్రైనేజీ పనులను 10 రోజుల క్రితం కొత్తపేట పాటి దిబ్బల వద్ద ఎమ్మెల్యే వెంకట్రావ్ ప్రారంభించారు. వివిధ కారణాలతో ఈ పనుల్లో జాప్యం జరగ్గా ఈ సమస్య ఎమ్మెల్యే దష్టికి వెళ్ళింది. వెంటనే స్పందించిన యార్లగడ్డ డ్రైనేజీ పనుల్లో జాప్యం జరగటంపై సంబంధిత అధికారులను ప్రశ్నించిన ఆయన తక్షణమే పనులు చేపట్టాలని పంచాయతీ ఈఓ ని ఆదేశించారు. దీంతో శుక్రవారం ఉదయం నుంచి జాతీయ రహదారి పై డ్రైనేజీల్లో సిల్టు తీసి శుభ్రం చేసే పనిని గ్రామపంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికను చేపట్టారు. గన్నవరంలోని ప్రధాన డ్రైన్ లతోపాటు అంతర్గత రహదారుల్లోని డ్రైనేజీలలో పూడిక తీసి మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు తెలిపారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి : మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అత్యాచారాలకు పాల్పడే నిందితులను ఉక్కు పాదంతో అణిచివేయడంతోపాటు వాటిని అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఇటీవల వైయస్సార్ కడప జిల్లా కంబాల దీన్నె లో మూడేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం హత్య ఘటన హదయ విదారకరం అన్నారు. చట్టాల పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించి తప్పు చేస్తే చట్టం నుంచి తప్పించుకోవడం అసాధ్యం అనే స్థాయిలో చైతన్యపరిచినప్పుడే ఇలాంటి దారుణ గంటలకు అడ్డుకట్టుపడే అవకాశం ఉందన్నారు. యావత్ సమాజం తలదించుకునే ఆకత్యాలకు పాల్పడిన నరరూప మగాలను కఠినంగా శిక్షించడం ద్వారా నేరపూరిత ఆలోచనలు చేసే వారి వెన్నులో వణుకు పుట్టించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని బుద్ధ ప్రసాద్ సూచించారు.

మొబైల్ టెక్నాలజీ బస్సు సందర్శన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని జెఆర్‌సి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఎపిఎస్‌ఎస్‌డిసి), ఇన్ఫోసిస్ లిమిటెడ్ హైదరాబాద్ సంయుక్తంగా రూపొందించిన మొబైల్ టెక్నాలజీ ట్రైనింగ్ బస్‌ను స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ సందర్శించారు. ఈ మొబైల్ బస్‌లో విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ ఐ), రోబోటిక్స్, వెబ్ టెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో శిక్షణల్ని అందిస్తున్నారు. ఈ శిక్షణలు ఇన్ఫోసిస్ కంపెనీకి చెందిన ప్రత్యేక నిపుణులచే పూర్తిగా ప్రాక్టికల్ పద్ధతిలో చేపడుతున్నారు. దీని ద్వారా విద్యార్థులు ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా టెక్నాలజీలో ప్రావీణ్యం సంపాదించగలుగుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ ఇలాంటి ఆధునిక శిక్షణ పథకాలు యువతకు కొత్త ఆశలు నింపుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జె ఆర్ సి విద్య సంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, సెక్రటరీ కరెస్పాండంట్ పెనుగొండ వెంకట రాజీవ్, ప్రిన్సిపాల్ జూటూరి వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, అమ్మని కాలేజీ ప్రిన్సిపాల్ సుధీర్, లైఫ్ స్కిల్స్ కాలేజీ ప్రిన్సిపాల్ తంగేళ్ల వెంకటేశ్వర రాజు, కళాశాల ప్రతినిధి కొత్త మసూ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట శాసన సభ్యులు రాం రాజగోపాల్ (తాతయ్య) నివాసంలో జగ్గయ్యపేట నియోజకవర్గం మరియు స్వయం శక్తి విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో తిరుమలగిరికి చెందిన వెలగాల పూర్ణిమ, జగ్గయ్యపేట సామినేని శంకర్ రావు లకు ఎంఎల్‌ఏ రాజగోపాల్ చేతుల మీదుగా వినికిడి యంత్రాలను అందింజేశారు. ఈ యంత్రాలను తీసుకు రావడానికి ప్రయత్నం చేసిన జగ్గయ్యపేట దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ని శాసన సభ్యులు తాతయ్య అభినందించారు.

వెలంపల్లిని కలిసిన కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక బ్రాహ్మణ వీధిలోని పశ్చిమ వైసిపి కార్యాలయం నందు శుక్రవారం నాడు ఇటీవల నూతనంగా నియమితులైన వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర ఐటి విభాగం కార్యదర్శి దొడ్డ రాజశేఖర్ రెడ్డి మాజి మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావుని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు వారిని శాలువాతో సన్మానించారు. పార్టీ బలోపేతానికి కషి చేయాలని వారికి సూచనలు చేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి శుక్రవారం ఎక్సెల్ ప్లాంట్, అజిత్ సింగ్ నగర్ లో అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వియంసి ఫైర్ సిబ్బంది ఈ

కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి అనే పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా ఎక్సల్ ప్లాంట్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగితే ఫైర్ ఎక్సటింగుషేర్ వాడి, మంటలను ఎలా ఆర్పాలి, వంటి విషయాలపై అక్కడున్న సిబ్బంది చే చేయించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ కాంప్లెక్స్ వద్ద

సిఐటియు జిల్లా కార్యాలయంలో

నిడమానూరులో...

సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయవాడ: సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. విజయవాడ అన్నపూర్ణ థియేటర్, ఎన్టీఆర్ కాంప్లెక్స్ ముఠా సెంటర్‌లో సిఐటియు పతాకాన్ని ముఠా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు ఎం.బ్రహ్మయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్షులు కెదుర్గారావు మాట్లాడుతూ సిఐటియు ఏర్పడి 55 సంవత్సరాలు కావస్తుందన్నారు. ఆనాటి నుండి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని అనేక పోరాటాలు నిర్వహించిన ఘనత సిఐటియుకే దక్కుతుందదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను బడా కంపెనీలకు అనుకూలంగా మారుస్తుందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాములు, నగర నాయకులు సిహెచ్ నరసింహులు పాల్గొన్నారు. విజయవాడ రాణిగారితోటలోని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంపై సిఐటియు పతాకాన్ని జిల్లా ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు పిల్లి నరసింహారావు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటేశ్వరరావు, కోశాధికారి యం.శ్రీనివాస్, విజయవాడ సిటీ నాయకులు ఇ.వి.నారాయణ, ఎస్.సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు కందుకూరి వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని సిడబ్ల్యుసి గోడౌన్ ముఠా వర్కర్స్ యూనియన్, బేవరేజెస్ హమాలి యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ వెంకటేశ్వరరావు, శ్రీను, జోగేశ్వరరావు, శ్రీనివాసరావు, బొగ్గవరపు శ్రీనివాసరావు, సోర్నాల వెంకటేశ్వరావు, దోనె సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల: సిఐటియు కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను సిఐటియు మండల కార్యదర్శి బి.భూషణం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.భూషణం, పంచాయతీ యూనియన్ నాయకులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: సిఐటియు కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పత్తిపాటి జ్యోతి, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతిరావు, మారేశ్వరరావు, చంటి, ప్రశాంతి, విజయ పాల్గొన్నారు.

జి.కొండూరు: హెచ్పిసిఎల్ ఆయిల్ ట్రక్ టెర్మినల్ కట్టుబడి పాలెం వద్ద సిఐటియు మండల అధ్యక్షులు సకుర్తి సుందరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిటాల శేషగిరిరావు, సుబ్బారావు, పిచ్చయ్య పాల్గొన్నారు.

తిరువూరు: నగర పంచాయతీ కార్యాలయం ముందు సిఐటియు జెండాను మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షురాలు సామ్రాజ్యం ఆవిష్కరిచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బలగాని వెంకటేశ్వరరావు, నాయకులు ఆకుల రవి, సురేష్, చాపలమడుగు నాగరాజు, మారిపోగు నాగరాజు, రమణ, కృష్ణవేణి, వెంకటేశ్వరావు, నరసింహారావు, బాబురావు పాల్గొన్నారు.

నందిగామ: నందిగామలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దసవరపు సైదా, పుట్ట మాణిక్యం, ఆకుల బేబీ, రాజరత్నం, సతీష్, నతానియేలు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

మైలవరంలో...

నందిగామలో...

తిరువూరులో...

జి.కొండూరులో...

రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-భవానీపురం: హెచ్ బి కాలనీ లోని 350 మరియు 450 ఎస్, ఎఫ్, టి బ్లాకుల వద్ద సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని హెచ్ బీ కాలనీ 350 మరియు 450 ఎస్.ఎఫ్.టి ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు,అసోసియేషన్ సలహాదారు ఎస్పీ శేషగిరిరావు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. బ్లాక్ నెంబర్ 13లో 30 కుటుంబాలు నివసిస్తున్నాయని వాటి మధ్య అంతర్గత రహదారులలో చెట్లు పెరగడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీ వెంకటేశ్వరరావు, ప్రసాద్, శ్రీనివాస్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ కమిషనర్ బదిలీకి ఒత్తిడి!

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణ బాబు బదిలీ చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ కమిషనర్ రమణబాబు బదిలీ చేయాలని ఒక బలమైన సామాజిక వర్గం, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్ని కి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ కమిషనర్ చాలా నిజాయితీపరుడని నందిగామ పట్టణ అభివద్ధికి ఆయన చేసిన కషి ఎంతో ఉందని పేర్కొంటూ మరో సామాజిక వర్గం వారు కమిషనర్ బదిలీ నిలుపుదల చేయాలని కోరుతూ కూటమి పార్టీలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కష్ణకుమారి బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి మున్సిపల్ కమిషనర్ తనకు ప్రోటోకాల్ పాటించకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ చైర్ పర్సన్ మరియు కమిషనర్ మధ్య గత కొంతకాలంగా కోల్డ్ వార్ నడుస్తుంది. కమిషనర్ రమణబాబు నందిగామ పట్టణంలో చేసిన అభివద్ధి పనులు ప్రజలకు తెలియజేస్తూ ప్రచారం చేసుకుంటున్నారని దీనిపై కొంతమంది జీర్ణించుకోలేక పోతున్నారని మరో వర్గం ఆరోపణ చేసుకుంటున్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రజలకు నిరంతరం మంచినీరు అందిస్తూ ప్రజల మన్నలను పొందారు. అదేవిధంగా అనధికారికంగా వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లను ధ్వంసం చేయడంతో రియల్ ఎస్టేట్ మాఫియాకు కమిషనర్ కంటగింపుగా మారినట్లు చర్చ జరుగుతుంది. నందిగామ మున్సిపల్ కమిషనర్ బదిలీపై రకరకాల ఆరోపణ చేసుకుంటూ కూటమి ప్రభుత్వం లో ఉన్న రెండు ప్రధాన పార్టీలు నాయకులు సోషల్ మీడియా ద్వారా విస్తతంగా పోస్టులు పెట్టుకుంటూ దుమ్మెత్తి పోసుకుంటున్నారు. కమిషనర్ బదిలీ నిలుపుదల చేయాలని కోరుతూ జనసేన పార్టీ అధ్యక్షులు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వద్ద కూడా కొంతమంది వెళ్లినట్లు సమాచారం.

నేడు విద్యాసాగర్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అత్యంత ప్రతిష్టాత్మకమైన ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎ.విద్యాసాగర్ ప్రమాణ స్వీకారం, పదవీ బాధ్యతలు స్వీకరించనున్న కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు భారీఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని విజయవాడ నగర అధ్యక్షుడు సివిఆర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 31వ తేదీ ఉదయం విద్యాసాగర్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నిక కానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు విజయవాడ గాంధీనగర్ ఏపీ ఎన్‌జీవో హోమ్ నుంచి భారీ సంఖ్యలో బైక్, కార్ ర్యాలీతో ఊరేగింపుగా బయలుదేరి శేషసాయి కళ్యాణ మండపానికి చేరుకుంటారు. అనంతరం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షునిగా సాయంత్రం ఐదు గంటలకు ప్రమాణ స్వీకారం చేసి... పదవి బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు.

ఆర్థిక అంశాలపై కిశోర బాలికలకు అవగాహన

గుడ్లవల్లేరు మండలంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నందివాడ మండలంలో...

పమిడిముక్కల మండలంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం అంగన్వాడి కేంద్రం వద్ద గుడివాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఎ. విజయ ఫ్లోరెన్స్ ఆధ్వర్యంలో కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు గూర్చి కిశోరిక బాలికలకు అవగాహన కల్పించారు. అలాగే శారీరక ఎదుగుదలకు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల భారిన బాలికలు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిడిపిఓ విజయ ఫ్లోరెన్స్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఈవూరి వాణి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా వర్కర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి - గుడివాడ :** కిశోరవికాసం వేసవి తరగతుల శిక్షణలో భాగంగా విద్యార్థినిలకు ఆర్థిక పొదుపులపై అంగన్‌వాడీ సూపర్ వైజర్ నసీరున్నిసా శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం రూరల్ మండలంలోని చౌటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులను ఆర్థిక పొదుపులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయకురాలు రఘమాదేవి. శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి - నందివాడ :** మండలంలోని అన్ని గ్రామాలలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా అరిపిరాల అంగన్వాడీ కేంద్రంలో ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు గురించి కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ ఎన్. నాగశిరీష మంట్లాడుతూ ఖర్చు కన్నా ఎక్కువ డబ్బ పొదుపు చేసుకోవాలని, అవసరమైన వరకు మాత్రమే రుణాలు తీసుకోవాలని అన్నారు. ఏఎన్ఎం, మహిళా పోలీస్ అంగనాడీ వర్కర్, పాల్గున్నారు.**ప్రజాశక్తి-కోడూరు :** యుక్త వయసు బాలికలు, మహిళల ఉజ్వల భవితకు కిశోర వికాసం కార్యక్రమం ఉపయుక్తమని ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజ రాజేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం కోడూరు వివర్స్ కాలనీ లోని అంగన్వాడి కేంద్రంలో కిషోర వికాసం సమర్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాక్షత గురించి, తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీ పిల్లలు ఏ విధంగా జాగ్రత్తపరుచుకోవాలి, మహిళ సంరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, అంశాల గూర్చి వివరించారు. ఏఎన్ఎం కుమారి, చంద్రమ్మ అంగన్వాడీ టీచర్ వాసంతి, ఆశ వర్కర్ లక్ష్మి, మహిళా పోలీస్ అంకమ్మ, కిశోర బాలికలు, వారి తల్లి తండ్రులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల :** కౌమార బాలికలు మంచి ప్రవర్తన కలిగి ఉండే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి అంగన్వాడి సూపర్వైజర్ ఎం ఝాన్సీ రాణి అన్నారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని కష్ణాపురంలోని పాత హరిజనవాడలో కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలికలకు సైబర్ నేరాలు, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడి టీచర్ ప్రశాంతి, శ్రీదేవి, బాలికలు పాల్గొన్నారు.

ఎంఎల్ఏ బుద్ధప్రసాద్‌తో సమావేశమైన బండి రామకృష్ణ

బుద్ధప్రసాద్‌తో బండి రామకృష్ణ భేటీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌ను జనసేన పార్టీ మచిలీపట్నం ఇంచార్జ్ బండి రామకృష్ణ ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు రాజకీయాలపై కొద్దిసేపు ముచ్చటించారు. మచిలీపట్నంలో జరిగే బీచ్ ఫెస్టివల్‌లో రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు ప్రమోషన్‌లో భాగంగా నిర్మాత డైరెక్టర్ హీరోయిన్‌తో పాటు చిత్ర బృందం రాకను బీచ్ ఫెస్టివల్ లో జరుగు ఏర్పాట్లను రామకృష్ణ బుద్ధ ప్రసాద్‌కు వివరించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ రామకష్ణను శాలువాతో సత్కరించి రైతులకు సేవ చేసే అవకాశం కూటమి ప్రభుత్వంలో రామకష్ణకు రావడం పట్ల ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. యువ నాయకులు మండలి వెంకట్రాం, మచిలీపట్నం నగర పార్టీ అధ్యక్షుడు గడ్డం రాజు, నీటి సంఘాల అధ్యక్షులు సాయన శివయ్య, కోటి మైకేల్ పాల్గొన్నారు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : సీఐటీయు 55వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలు శుక్రవారం మచిలీపట్నంలో ఘనంగా జరిగాయి. మచిలీపట్నం కోనేరు సెంటర్ పెద్ద ముఠా హమాలీలు కార్యాలయంలో లో సీఐటీయు జండాని ముఠా కార్మిక నాయకుడు మరిడయ్య ఆవిష్కరించారు. సిఐటియు మండల అధ్యక్షులు బూర సుబ్రహ్మణ్యం, సిఐటియు మండల కార్యదర్శి చిరువోలు జయరావు, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎండి యూనస్, బిల్డింగ్ వర్కర్స్ మండల కోశాధికారి జమళ్ళ బాబురావు, ముఠా కార్మికుల సంఘం నాయకులు సభ్యులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-బంటుమిల్లి :** సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బంటుమిల్లి సిఐటియు ఆఫీసులో సిఐటియు మండల అధ్యక్షురాలు బొర్రా రత్నకుమారి జండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు వంగల రాజు, ఎల్ అజయ్ ఘోష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గుత్తికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బందరులో...

బంటుమిల్లిలో...

2న ఘంటసాల ఎంఎంసి చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : జూన్ రెండో తేదీన ఘంటసాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ,పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం, ఏఎంసీ ప్రమాణ స్వీకార కార్యక్రమం సన్నాహక సమావేశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ రెండో తేదీ ఉదయం 10 గంటలకు కొడాలి మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఘంటసాల ఏఎంసి తోట కనకదుర్గ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. సభకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహా పలువురు రాష్ట్ర మంత్రులు విచ్చేయునున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టిడిపి ఘంటసాల మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, ఆమనగడ్డ జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, మోపిదేవి మండల పార్టీ అధ్యక్షుడు పూష డ పు రత్న గోపాల్ పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతో భూసారం పెరుగుదల

రైతు సదస్సులో మాట్లాడుతున్న సుధారాణి

ప్రజాశక్తి - పామర్రు : ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల సమన్వయంతో వికసిత కృషి సంకల్ప అభియాన్ అనే అవగాహన కార్యక్రమాన్ని స్థానిక పామర్రు మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారిణి, కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డా. డి. సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అధిక మోతాదు లో రసాయన మందుల వినియోగిం చడం ద్వారా నేల కలుషితం అవుతుందని, భూసారాన్ని కాపాడుకోవడానికి పచ్చ రొట్ట ఎరువుల వినియోగం చేపట్టాలని అన్నారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలని రైతులకు వివరించారు. పురుగు మందుల వినియోగించడం కూడా తగ్గించుకుని అవశేష రహిత పంట ఉత్పత్తులను పొందాలని తెలియచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలను జిల్లా అధికారి మనోహర రావు, పామర్రు ఏడీఏ స్వర్ణ లత రైతులకు తెలియచేశారు. జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ, భారతీయ ఆయిల్ పామ్ పరిశోధన శాస్త్రవేత్త డా. అనిత, శాస్త్రవేత్తలు రేవతి, శైలజ రాణి, మండల వ్యవసాయ అధికారిణిలు పద్మజ పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటశాల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో వికసిత్ కషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం జె.యశ్వంత్ కుమార్ కె.వి.కె నిర్వహించే కార్యక్రమాలు, లభ్యమయ్యే విత్తనాలు, భూసార పరీక్ష ఉపయోగాల గురించి వివరించారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం డాక్టర్ కె.నాగేంద్రరావు, డాక్టర్ సుబ్బన్న, వ్యవసాయశాఖ ఏడిఏ ఎన్.రమాదేవి, జె.కీర్తి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు..

వెట్టి కార్మికులను వారి సొంత జిల్లాలకు పంపాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన 9 మంది ఆంధ్రప్రదేశ్ రాష్టానికి చెందిన వెట్టి చాకిరి కార్మికులను వారి సొంత జిల్లాలకు సురక్షితంగా పంపిం చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచిం చారు. తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి నాగర్ కర్నూల్, పెంట్లవల్లి మండలం, మల్లేశ్వరం గ్రామంలోని ఫిషింగ్ యూనిట్‌లో 9 మంది వెట్టిచాకిరి చేస్తున్న (బాండెడ్) కార్మికులను ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారిగా గుర్తించారు. కొల్లాపూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఆ 9 మందిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం, కష్ణా, విజయనగరం, తూర్పు గోదావరి, విశాఖపట్నం, కడప, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాలకు చెందినవారని తెలియజేసి ఆ కార్మికులకు కష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయానికి తీసుకొనివచ్చి అప్పగించారు. వారు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలిశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వారితో సంభాషించి, ప్రత్యేక చొరవ తీసుకొని ఆ కార్మికులను సురక్షితంగా వారి స్వంత జిల్లాలకు పంపించుటకు, వారి కుటుంబ సభ్యులకు అప్పగించుటకు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబుకు సూచనలు జారీ చేశారు. దీంతో కష్ణాజిల్లా నుండి ప్రత్యేక సిబ్బందిని, పోలీసు సిబ్బందిని నియమించి కార్మికులను సంబంధిత జిల్లాలకు పంపించారు.

ఎన్‌టిఆర్ నట విశ్వరూపం విజయవంతం

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్టీఆర్ 102 వ జయంతి సందర్భంగా రాష్ట్రస్థాయిలో రెండు అంశాలపై అవగాహన ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సినీ కథా నాయకునిగా ఎన్టీఆర్, ఆంధ్ర ప్రజా నాయకునిగా ఎన్టీఆర్, విజయవాడ గాంధీనగర్ కౌతావారికి కళా వేదికలో నిర్వహించిన మన దేశం నుండి నా దేశం వరకు ఎన్టీఆర్ చిత్రాలు పాటలను గాయకుల ఆలపించారు. ఈ కార్యక్రమానికి చింతకాయల చిట్టిబాబు అధ్యక్షత వహించారు. అనంతరం ఊరూరా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ తెలుగు సినిమా కథానాయకునుగా ఎన్టీఆర్ 302 సినిమాల్లో పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక చిత్రాల్లో అపూర్వముగా 33 ఏళ్ల సినిమా కథానాయకుడు నటించిన ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. 13 ఏళ్లు 1982 నుంచి 1996 వరకు. 14 ఏళ్ళు రాజకీయాల్లో ఆంధ్రుల తిరుగులేని ప్రజా నాయకునిగా ఎన్టీఆర్ అని కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రాల్లోని గోల్డెన్ హిట్స్ పాటలు ఆలపించారు. అనంతరం10 మంది ప్రముఖులకు ఎన్టీఆర్ అవార్డులు ప్రధానం చేశారు. గోళ్ళ నారాయణరావు మీరా కుమార్ టీవీ శేషగిరిరావు కె.వి బ్రహ్మానందం, ముష్టి శ్రీనివాసరావు, రుత్తుల లక్ష్మీదేవి, కోట వెంకటేశ్వర రెడ్డి, నండూరి రామానుజాచార్యులు, ఎస్వి కనకారావు, రాయి కనకారావు, మోహన్ రావు, పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కోడూరు : సామాజిక సేవ తత్పరుడు, ఆపదలో ఉన్న వారికి అపన్న హస్తం అందించే లెజెండ్స్ సోషల్ సర్వీస్ దివిసీమ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పూతబోయిన అయ్యప్ప స్వామి జన్మదిన సందర్భంగా లెజెండ్స్ సోషల్ సర్వీస్ టీం సభ్యులు, మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మచిలీపట్నంలో వీధులలో నివసించే నిరాశ్రయులైన పేదవారికి ఆహార పొట్లాలు అందించారు. అనంతరం మచిలీపట్నం లోని ఓల్డ్ ఏజ్ హెూమ్ కు 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం, గురువారం మధ్యాహ్నం భోజనం లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థ తరపున అందజేశారు. వాటితో పాటు అవనిగడ్డ ఏరియా హాస్పిటల్ లో రోగులకు సిబ్బందికి పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-వత్సవాయి: ప్రతి రైతు పొలంలో భూసార పరీక్షలు తప్పనిసరి అని వ్యవసాయ పరిశోధన స్థానం గరికపాడు ప్రధాన కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ కష్ణంరాజు అన్నారు మండలంలోని పెదమోదుగు పల్లి గ్రామంలో గ్రామ సచివాలయ ఆవరణంలో కేవల్ రావు యశోషి విజ్ఞాన కేంద్రం గరికపాడు వారు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాలు అనుసరించి రైతులు ఎరువులు వాడుకోవాలని తెలిపారు. కెవికె డాక్టర్ పిఎస్ శివప్రసాద్ మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు వాడటం వల్ల పైర్లు పెంపకం వలన నాణ్యమైన పంట ఉత్పత్తులు మరియు మంచి దిగుబడులు సాధించుకోవచ్చు అని తెలిపారు. ఐ సి ఏ ఆర్ డాక్టర్ హెచ్ ఎస్ మహేష్ శాస్త్రవేత్త మాట్లాడుతూ తొలి దశలో వేపనూనె వాడటం విత్తనశుద్ధి చేసుకోవడం జిగురు అట్టలు వాడటం వలన పసుపు , నీళ్ల రంగు, అట్టలు వాడటం చేయటం వలన మరియు తెగుళ్ల ఉధతిని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్, సహాయకుడు రాకేష్ స్వార్థక సహాయకురాలు ఆరు నవ్య తదితరులు పాల్గొన్నారు.

63 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్ర దేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డిఆర్‌డిఎ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిరుద్యోగులకు జాబ్ మేళా జరిగింది. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్. సుశీలరావు తెలిపారు. ఉద్యోగం చిన్నదా, పెద్దదా అన్న అపోహను యువత పెట్టుకోవద్దని, ఉద్యోగం చేసుకుంటూ వెళ్తే అదే ఆవ్యక్తుల ను ఉన్నత స్థితికి తీసుకెళ్తుందన్నారు. ఈజాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు 152 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 63 మంది ఎంపికయ్యారు.

4 వరకు అమెజాన్ రిఫ్రెష్ సేల్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అమెజాన్ తమ 16వ వార్డ్ రోబ్ రిఫ్రెష్ సేల్ (డబ్ల్యూఆర్ఎస్)ను ఈ నెల 30 నుండి జూన్ 4 వరకు నిర్వహిస్తున్నామని అమెజాన్ ఫ్యాషన్ సంస్థ మార్కెటింగ్ హెడ్ ఎం.మణి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విస్తారమైన బ్రాండ్ పోర్ట్ ఫోలియో నాలుగు లక్షలకు పైగా స్టైల్స్‌తో, ఇప్పుడు 20 పైగా బ్రాండ్స్ నుండి వ్యూహాత్మకమైన కొత్త చేరికలతో, కారట్లేన్, గ్యాప్, వైల్డ్ క్రాఫ్ట్ ఇంకా ఎన్నో బ్రాండ్స్ కలక్షన్స్, ఉన్నాయన్నారు. ప్రత్యేకమైన కొత్త ప్రీమియం వేదిక ద ప్రీమియం ఎడిట్ తో పాటు రీబ్రాండ్ చేయబడిన జెన్ జెడ్ వేదిక సెర్వ్ ను కూడా కలిగి ఉందన్నారు. ప్రీమియం ఫ్యాషన్ పట్ల ఆసక్తి చూపించే వారు గెస్, అర్మాని ఎక్స్ ఛేంజ్, కాల్విన్ క్లీన్, లకోస్ట్, అలెగ్జాండర్ క్రిస్టీ, మైఖేల్ కోర్స్, మోకోబరా, టమ్మీ హిల్ ఫిగర్, లూయిా ఫిలిప్పీ, ఫాసిల్, ఇంకా ఎన్నో బ్రాండెడ్ ఐటమ్స్ ఉన్నాయని అన్నారు, ట్రెండ్ పట్ల చైతన్యం కలిగిన వినియోగదారులు కొత్తగా విడుదలైన అమెరికన్ క్లాసిక్ బ్రాండ్ గ్యాప్‌ను కనీసం 30 శాతం తగ్గింపుతో కొనుగోలు చేయవచ్చన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ఒకే కాన్పులో కవలలు జననం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ ఏరియా ప్రభుత్వ వైద్యశాల లో బుధవారం చందర్లపాడు మండలం కోనాయ పాలెం గ్రామానికి చెందిన కంభంపాటి భవాని భర్త కంభంపాటి కిషోర్ దంపతులకు ఒకే కాన్పులో ఇద్దరు మగ కవల పిల్లలు జన్మించారు. ఈ సందర్భంగా ఏరియా వైద్యశాల ఛైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ వైద్య బృందం ఎంతో చక్కగా వైద్య సేవలు అందించారని అభినందించారు. తాను ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి గతం కన్నా మిన్నగా వైద్యశాలలో సాధారణమైన ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించే విషయంలో ఎన్నో మార్పులు చేర్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ , సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ సీతారావమ్మ డాక్టర్. మాధవీలత, డాక్టర్ శిరీష , హెడ్ నర్స్ సునీత పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-కంచికచర్ల: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు అవసరమైన విత్తనాలు ఎంఆర్పీ ధరలకే అమ్మాలని వ్యవసాయాధికారి విజయ్ కుమార్ సూచించారు. కంచికచర్ల లో విత్తనాలు షాపులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. షాపుల్లో నిల్వ చేసిన విత్తనాలు, స్టాకు బోర్డు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ లో పెసలు, మినుములు, మొక్కజొన్న, పత్తి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు ఎంఆర్పీ ధరలకు అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే సంబంధించిన షాపులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని సూచించారు.

తిరువూరు: తిరువూరు పట్టణంలోని విత్తన షాపులను సహాయ వ్యవసాయ సంచాలకులు జి. కెనడి, మండల వ్యవసాయ అధికారి పి.పద్మతో శుక్రవా రం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకా లను పరిశీలించారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డులో విత్తన నిల్వ, అమ్మకపు ధర అప్డే ట్ చేయాలని సూచించారు.

తిరువూరులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

విత్తనాలు కొనుగో లు చేసిన రైతులకు బిల్లుపై తప్పనిసరిగా పంట పేరు, రకం, విత్తన తరగతి, లాట్ నంబర్ అమ్మక పు ధర వివరాలు నమోదు చేసి రైతు సంతకం చేయించుకుని ఇవ్వాలని సూచించారు. గరిష్ట చిల్లర ధరకు మించి విక్రయాలు జరిపినట్లయితే సదరు డీలర్లపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు విత్తనాల షాపుల డీలర్లను హెచ్చరించారు. రైతులందరూ విత్తనా లు కొనుగోలు చేసేటపుడు తప్పనిసరిగా బిల్లు తీసుకుని మాత్రమే కొనుగోలు చేయాలని, అలా గే బిల్లును సీజన్ పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-వత్సవాయి: ప్రతి రైతు శాస్త్రవేత్తల సూచన సలహాలు దించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజప్ప అన్నారు. మండలంలోని భీమవరం గ్రామంలో కెవికె గరికపాడు ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ 2025 ప్రీ ఖరీఫ్ ప్రిపరెడ్నెస్ లో భాగంగా భీమవరం గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కెవికె శాస్త్రవేత్త డాక్టర్ కే లక్ష్మీ కళ, ఐసిఎఆర్ నిర్మా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజప్ప , జగ్గయ్యపేట ఏడిఏ భవాని, జగ్గయ్యపేట డివిజన్ హెచ్ఓ వర్ధిని మాట్లాడారు. పశు సంవర్ధక డిపార్ట్మెంట్, గ్రామ సర్పంచ్ మాధవి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది అరవింద్ మరియు స్వప్న పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎడిఎ భవాని మాట్లాడుతూ వివిధ జాతీయ మరియు రాష్ట్ర పథకాలను రైతులకు వివరించారు. అలాగే రైతుల సమస్యలను తగు పరిష్కారాలు చెప్పారు. వర్ధిని మాట్లాడుతూ ఉద్యాన పంటలో ముఖ్యంగా మైక్రోఇరిగేషన్ పథకం, ఉద్యాన పంటలలో సబ్సిడీలను వివరించారు.పశువైద్య విభాగం వారు సీజనల్ వ్యాధులు వాటి నివారణ చర్యలను వివరించారు. భీమవరం గ్రామంలో ముఖ్య సమస్యలైనా మిరపలో తెగులు అలాగే పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు రైతులకు సూచనలు ఇచ్చారు.

డాబర్ ఎనర్జీ ఉత్పత్తుల ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: క్రీడాకారులలో ఎనర్జీ రావడానికి డాబర్ గ్లూకోజ్ ఉత్పత్తులను నగర మార్కెట్లోకి తీసుకువచ్చారు. నగరంలోని ఓ హోటల్ నందు క్రీడాకారుల ఆధ్వర్యంలో నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సి ఈ ఓ గార్గ్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎనర్జీ ఉత్పత్తులకు ఆదరణ పెరిగిందని దీనిని దష్టిలో ఉంచుకొని నూతన ఉత్పత్తుల ను తీసుకువచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా క్రీడాకారులకు ఎనర్జీ అంది హేందుకు డాబర్ గ్లూకోజ్ రూపొందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏకత్వ పాఠశాలలో అత్యుత్తమ విద్యాబోధన

డైరెక్టర్ అమరనేని రమేష్‌బాబు

ప్రజాశక్తి-వీరులపాడు

విద్య ఎవరి సొత్తు కాదని, అది సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలని, విద్య ద్వారా సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులు వస్తాయని భావించి నందిగామకు చెందిన ప్రముఖ విద్యావేత్త అమరనేని రమేష్‌బాబు తనయుడు అమరనేని మనోజ్ వీరులపాడు మండలం పొన్నవరం గ్రామంలో ఏకత్వ పాఠశాలను నిర్మించారు. అంతర్జాతీయ ప్రామాణికాలతో సీబీఎస్సీ నియమ నిబంధనలకు అనుకూలంగా విశాలవంతమైన తరగతి గదులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసం అధునాతనమైన కంప్యూటర్, సైన్స్, మ్యాథమాటిక్స్ ల్యాబ్ సౌకర్యాలతో, చిత్రకళా రంగంలో, సంగీత, నృత్య కళలను కూడా విద్యార్థి దశ నుండే అలవర్చుకోవడం కోసం విశాలవంతమైన డాన్స్, మ్యూజిక్, చిత్ర కళా స్టూడియోలతో, ప్రతి ఒక్క విద్యార్థి మానసిక శారీరక ఎదుగుదల కోసం వ్యాయామ విద్యకు కూడా పెద్దపీట వేస్తూ సుమారు 50 లక్షల రూపాయల వ్యయంతో ఈతకొలను, బాస్కెట్బాల్ కోర్ట్, యోగాశాల, క్రికెట్ నెట్స్, ఫెన్సింగ్, టైక్వాండో, స్కేటింగ్, 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్ కలిగిన క్రీడామైదానంతో నిర్మించిన ఏకత్వ పాఠశాల నందిగామ నియోజకవర్గంలో అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. తల్లిదండ్రుల మన్ననలు పొందుతున్న పాఠశాల నిర్వహణ పట్ల స్థానిక ఎమ్మెల్యే కూడా ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నిపుణులతో డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ నియోజకవర్గంలోనే ఉత్తమ పాఠశాలుగా గుర్తింపు పొందింది. చుట్టూ ప్రహరీతో విశాలమైన మైదానం, పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం విద్యార్థులను, తల్లిదండ్రులను ఆకట్టుకుంటుంది. తల్లిదండ్రులకు ఫీజులు భారంగా మారిన ప్రస్తుత తరుణంలో అతి తక్కువ ఫీజులతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య, క్రీడలు ఇతర సదుపాయాలను కల్పిస్తూ నియోజకవర్గంలోనే ఏకత్వ పాఠశాల గుర్తింపు పొందింది.

అత్యుత్తమ ఉపాధ్యాయులతో విద్యా బోధన
పాఠశాల డైరెక్టర్ అమరనేని రమేష్‌బాబు

పొన్నవరం గ్రామంలో గత సంవత్సరం ప్రారంభించిన ఏకత్వ పాఠశాల సంవత్సర కాలంలోనే ఎన్నో రికార్డులు సాధించింది. అన్ని సౌకర్యాలతో విద్యార్థులకు బోధన అందిస్తున్నాం. విద్యను అందరికీ అందించడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుంది. ప్రతి ఒక్కరూ సమాన అవకాశాలను పొందుతారు. ప్రతీ పాఠశాలలో భవనాలు, తరగతి గదులు, ఆట స్థలం, గ్రంథాలయాలు పాఠశాల మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని పొన్నవరంలోని ఏకత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించాం.

అపార అనుభవము, అత్యుత్తమ ఉపాధ్యాయులతో విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్నాం.

సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ 'షైన్స్' విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ ఫుడ్ విభాగ ఉత్పత్తుల సంస్థ ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్, తమ మామ్స్ మ్యాజిక్ షైన్స్ షైనీ బటర్ (వెన్న) కుకీని విడుదల చేసినట్లు సంస్థ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హరీష్ తెలిపారు. నగరంలోని ఐటిసి సంస్థ.కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇది బటర్ కుకీ ప్రియులకు ఆనందకరమైన కొత్త అనుభవాన్ని అందిస్తామనే వాగ్దానం చేస్తోందన్నారు. ఒక తల్లి తన బిడ్డలో ప్రతిభను బయటకు తీసుకువచ్చినట్లే, ఈ కరకరలాడే, వెన్నతో కూడిన కుకీని సున్నితమైన చక్కెర గ్లేజింగ్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేశారన్నారు. ఆకృతిని పెంచే ప్రత్యేకమైన మెరిసే చక్కెర గ్లేజింగ్‌తో రూపొందించబడిన ఈ కుకీలో నోరూరించే వెన్న నింపబడిందన్నారు.

రేషన్ పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-తిరువూరు

రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తేదీ నుండి నేరుగా రేషన్ డీలర్ల నుండి నిత్యావసర సరుకుల పంపిణీ చేస్తున్నందున తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారిణి కె.మాధురి స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌ను శుక్రవారం సందర్శించి నిత్యావసర సరుకులను పరిశీలించారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె డీలర్లకు సూచించారు. డివిజన్‌లోని అన్ని ఈపోస్ మెషిన్స్, వేయింగ్ మెషిన్స్‌లను నైపుణ్యం గల సాంకేతిక నిపుణులతో బాగు చేయించాలన్నారు. అక్రమాలకు తావు లేకుండా నిజాయితీగా నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని ఆదేశించారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని విజ్ఞాన్ విద్యాసంస్థల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపినట్లు సెక్రటరీ, కరస్పాండెంట్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. తోట బిందు శ్రీ 587 మార్కులు, మోరే హారిక 584 మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ ఈ విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ బాషా, ఎన్‌సిసి ఆఫీసర్ పి. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.